# బొట్టు

సవితకి పెళ్లిట– ఈ నోటా ఆ నోటా ఆ వార్త నాకు చేరింది. సవితకి పెళ్లంటే నాకొక కంట ఆనందబాష్పాలూ– ఇంకో కంట విషాద ధారలూ కారేయి.

సవితని నేను పెళ్ళి చేసుకోవాలని అనుకున్నాను. నా నిర్ణయం వినగానే "సిగ్గులేదా ఆ మాటనడానికీ.." నాన్న అరిచాడు.

"అసలా అమ్మాయి పెళ్లి చేసుకుంటుందనే అనుకుంటున్నావా?"

అంది అమ్మ.

"ఎందుకు చేసుకోకూడదూ? అంటున్నాను..." అన్నాన్నేను కఠినంగా.

"పెళ్లి చేసుకోనీ- ఇంకోణ్ని చంపనీయ్- నువ్ మాత్రం దాని మెళ్లో 'పుటుక్కుమనే' తాళికట్టి- 'గుటుక్కు'మనడానికి నేను వప్పుకోను!" నాన్న ఉగ్రస్వరం.

"అవున్రా దాని జాతకం అలాంటిది! కట్టుకున్న నెల్లోగానే మొగుడు యాక్సిడెంటైపోయాడంటే..." అంది అమ్మ.

ఇలా మా ఇంట్లో రాద్ధాంతాలూ సిద్ధాంతాలూ జరుగుతున్నాయి.

ఇవ్వాళో రేపో ఇంట్లోవాళ్లతో పోట్లాడైనా- సవితని పెళ్లి చేసుకోవాలనుకున్నాను.

✦ ✦ ✦

"అసలు నీలాంటి బుద్ధిలేనివాణ్నైనా రెండో పెళ్లాడతానంటే.. ఆ అమ్మాయికి నీతి నియామాల మీద ఎంత గౌరవం వుందో అర్థమౌతోంది" మొన్న నాన్న మళ్లీ నన్నూ ఆ అమ్మాయినీ తిట్టి పోశాడు.

"మీరు నన్ను బుద్ధిలేనివాణ్నని తిట్టండి... వప్పుకుంటాను- ఆ అమ్మాయిని నీతి నియమాలు లేనిదనకండి" ఫైనల్ వార్నింగ్‌లా అరిచాను.

✦ ✦ ✦

'ఇవ్వాళో రేపో వెళ్లాలి' అనుకున్నాను.

'అసలు.. సవితని... మళ్లీ పెళ్లికొప్పించటం పెద్ద శ్రమే అనుకుంటున్నాను'

ఇంతలోకే శుభవార్త!

సవిత పెళ్లివార్త! ఆనంద విషాదాల సమ్మేళనం!!

ఆనందం- ఆ అమ్మాయి పెళ్లికొప్పుకున్నందుకు. బాధ- సవితని నేను మిస్సయినందుకు.

దేవుడున్నాడు- ఉంటే సవితకి మేలు చేస్తాడు.

దేవుణ్నంతగా నమ్మని నాకు దేవుడిమీద భారం వేయచ్చనిపించింది.

సాయంత్రం సవిత ఇంటికి బైల్దేరాను.

సవితా నేనూ ఒకేసారి డిగ్రీ కంప్లీట్ చేశాం.

'వహ్వా' అనిపించే అందం కాదు.. తనది! 'వారెవ్వా' అనిపించే మంచి మనస్సు ఆమెది! చాలాసార్లు కాలేజీలో ఆమె ప్రవర్తన చూసి, 'నేను నిన్ను ప్రేమిస్తున్నాను. మనం పెళ్ళి చేసుకుందామా' అని అడగాలనుకున్నాను.

కానీ ఆ అమ్మాయి డిగ్నిటీని చూస్తే భయమేసి 'ఛీ' అంటే, ఆ పరిచయమైనా మిగల్దని భ్రమలోపడి- మాటను గొంతులో నొక్కుకున్నాను.

అప్పుడూ అప్పుడూ వాళ్లింటికి వెళ్లడం-

రోడ్డు మీద ఎప్పుడైనా కన్పించినప్పుడు...

"హాయ్... బై" అనుకునేవరకు మా స్నేహం పరిమితం చేసుకున్నారు-

మొదటిసారి.

మా ఇంటికి సవిత స్వయంగా పెళ్లి కార్డు తెచ్చి... ఇచ్చినప్పుడు చాలా ఆనందంగా రిసీవ్ చేసుకున్నాను.

పెళ్లికి నేను వెళ్లలేదు-

రిసెప్షన్‌కైనా వెళ్లాలని... వెళ్లకపోతే ఈర్ష్యతో మానేసానని అనకుంటుందని వెళ్ళాను.

పెళ్లికొడుకు నాకన్నా బావున్నాడు.

ఏదో గిఫ్ట్ ఇచ్చి... నవ్వు మొహం పులుముకుని గ్రూప్ ఫోటో దిగాను.

మొగుడికి చెవిలో నన్ను పరిచయం చేసింది సవిత.

అప్పుడు నాకేసి చూసాడు పెళ్లికొడుకు.

'పిచ్చి వెధవా! ఇంత అందమైన అమ్మాయిని మిస్సయ్యావా?' అన్నట్టు అన్పించిందా చూపు.

పెళ్లయిన నెల్లాళ్ళకే ఆ అందగాడు మబ్బుల్లోకెళ్లిపోయాడు.

అమావాస్య సవితను కమ్మేసింది.

ఓదార్చడానికి వెళ్లాలనిపించలేదు.

అందంగా నవ్వే సవిత మొహం మిస్సవ్వాలనిపించలేదు.

కన్నీళ్ళింకిపోయాక... ఓ నెల్లాళ్లకి సవితను చూడొచ్చన్న ధైర్యం వచ్చింది.

సవిత కళ్లల్లో నీళ్ళు లేవు.

'అమ్మయ్య' అనిపించింది.

ఆ కళ్ళల్లో మునపటి వెలుగూ లేదు.

బాధేసింది.

మోడువారిన చెట్టును చూడ్డం...

మొగలాయిలు నరికేసిన అందమైన విగ్రహాన్ని చూడ్డం...

ఎంత కష్టం...

ఐదారు నెలల్లో ఖాళీ ఉన్నప్పుడల్లా సవితను చూసొచ్చేవాణ్ణి.

ఇప్పుడు ఇంట్లో 'ఊ' అన్పించుకున్నాకు సవితతో పెళ్ళిమాట మాట్లాడదామని నా ప్రయత్నం.

నాకన్నా ముందే సవిత తల్లిదండ్రులు ధైర్యంచేసి ఆ అమ్మాయి నొప్పించి- పెళ్లికి సిద్ధం చేశారన్నమాట.

నాదెప్పుడూ లేట్ ఎంట్రీయే.

సవితను కలిసాను.

ఆ అమ్మాయి కళ్ళు నవ్వుతూ... వెలుగుతున్నాయి.

నిజంగానే సంతోషించాను.

సవిత నన్ను ఆనందంగా రిసీవ్ చేసుకుంది.

"నాకు మళ్ళీ పెళ్లిట!" అంది.

"మళ్ళీ కాదు... జరిగింది బొమ్మల పెళ్ళి.. ఇప్పుడే అసలైన పెళ్ళి" అన్నాను అభినందన పూర్వకంగా.

సవిత నన్ను చాలా ఆత్మీయంగా చూసి- "నా ఉడ్ బీ... కంట్రీ క్లబ్‌లో సాయంత్రం తన ఫ్రెండ్స్‌కి పార్టీ ఇస్తున్నాడు. అమ్మానాన్న పెళ్ళి పనుల్లో హడావుడిగా వున్నారు.... నువ్వు రావొచ్చుగా.. సుబ్బా!" అంది.

"పానకంలో పుడకలా..." నవ్వేశాను.

"కాదు.. కూల్‌డ్రింక్‌లో స్ట్రాలా..."

"స్త్రానా.. ఎక్స్ట్రానా?"

"నీతో నేను వాదించలేను... నువ్ రావాలంతే..!"

"సరే.. సవితా!! తప్పకుండా వస్తాను"

✦ ✦ ✦

కంట్రీ క్లబ్‌లో ఆరోజు పెళ్ళికొడుకు అనబడే హరిప్రసాద్‌ని మొట్టమొదటిసారి చూసాను. హరిప్రసాద్‌కి చాలామంది ఫ్రెండ్స్ ఉన్నారు. అందరూ కలసి గంజాయి వనమే చేస్తారు.. తులసిమొక్క 'సవిత.. ఒక్కత్తే' అనిపించింది.

ఆడేవాళ్లూ... తాగేవాళ్లూ... వాగేవాళ్లూ... అందరూ హరిప్రసాద్ స్నేహితులు.

'నీ స్నేహితులు ఎలాంటివాళ్లో చెప్పు నువ్వెలాంటివాడివో చెప్తాను' అన్న మహనీయుల కొటేషన్ నా మదిలో మెదిలింది!

సవిత ముందు.. అతని ఆడ స్నేహితులు. తాగి ఆడే మగ స్నేహితులు.. విచ్చలవిడిగా మాట్లాడేస్తుంటే సవితన నన్ను పిల్చి "ఇంటికెళ్లిపోదాం సుబ్బూ... తోడొస్తావా?" అంది జాలిగా.

"చాలా మంచి నిర్ణయం.. పద" అన్నాన్నేను.

మేము బయల్దేరడం హరిప్రసాద్ గమనించేస్థితిలో లేదు- "సరే పో" అన్నట్టు మరో అమ్మాయితో కబుర్లలో పడిపోయాడు.

బయటికి వచ్చి ఆటో ఎక్కిన మేము- ఒకర్తో ఒకరం మాట్లాడుకోలేదు.

ఇంటికొచ్చాక సవిత తల్లీతండ్రీ "ఏమ్మా! అప్పుడే వచ్చేశావ్?" అన్నారు.

"నా రెండో మొగుడు కూడా చచ్చిపోయాడు నాన్నా!" అని ఏడుస్తూ పెట్టుకున్న బొట్టుబిళ్ల విసిరికొట్టి గదిలోకెళ్లిపోయింది. తల్లిదండ్రులు స్థాణువులయ్యారు.

నేను మొహమాట పడుతూనే విషయం వివరించేను.

"సవితను పెళ్లికి ఒప్పించడానికి చాలా తంటాలు పడ్డాం బాబూ... మేము ఎంచుకున్న సంబంధం, మా తొందరపాటు తప్పని తేలింది"

నాకూ అయోమయంగా వుంది.

"నేనొక్కసారి సవితతో మాట్లాడనా?" నా గొంతు నాకే స్థిరంగా విన్పించింది.

"మావల్ల ఓదార్చడం అవదు.. పెళ్ళి అని ఆశ పెట్టకపోతే పిల్లకు ఇంత దుఃఖం ఉండేది కాదు!'. అంది సవిత అమ్మగారు.

"నువ్వే మాట్లాడు! నా మాట పోయింది! నాకు మాట్లాడే అర్హతా పోయింది" అన్నాడు సవిత తండ్రి.

సవిత గదిలోకెళ్ళాను. ఏడుస్తున్న ఆమె కన్నీళ్లు తుడిచి ఆ నీటితో నుదిటిపై బొట్టు పెట్టాను.

"నేను నిన్ను పెళ్లి చేసుకుంటే నీకు ఇష్టమేనా?" అన్నాను.

"నిజమా...!!" మరిన్ని కన్నీళ్లు కార్చింది సవిత.

"నీకు నిశ్చయమైన ముహూర్తానికే నీ మెళ్లో తాళి... కళ్లల్లో కాంతి చూస్తాను" అని చెంపల మీద జాలువారుతున్న ఆనందబాష్పాల్ని పెదవుల్తో పట్టి – నుదుటి మీద బొట్టుచేసాను... ఈ ఆనందబాష్పాల తడి ఆరకూడదని.

